## మనం మనల్ని, మన ప్రియమైన వారిని ఎలా పరీక్షించుకోవచ్చు?

గాజు వజ్రం.. సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి పెన్ పవర్

**కడప పెన్ పవర్ జూలై 20 :** ఒక రాజ దర్బారు నిర్వహించబడుతోంది. శీతాకాలం కావడంతో దర్బారు బహిరంగ ప్రదేశంల్లో ఏర్పాటుచేయబడింది. పెద్దల సభ అంతా ఉదయపు నీరెండలో కూర్చుని ఉన్నారు. రాజు సింహాసనం ముందు ఒక రాచరికమైన బల్ల ఉంది, దాని మీద కొన్ని విలువైన వస్తువులు పెట్టి ఉంచారు. పండితులు, మంత్రులు, దివానులు అందరూ అక్కడ ఉన్నారు. రాజ కుటుంబ సభ్యులు కూడా అక్కడ కూర్చుని ఉన్నారు. అంతలోనే ఓ వ్యక్తి వచ్చి లోపలికి వెళ్లేందుకు అనుమతి కోరాడు. అతను లోపలికి ప్రవేశించి, రాజుకు నమస్కరించి ఇలా అన్నాడు, " మహారాజా! నా దగ్గర రెండు వస్తువులు ఉన్నాయి, నేను వివిధ రాజ్యాలు తిరిగి అక్కడ ప్రతీ రాజుకు వాటిని చూపించాను, కానీ ఎవరూ వాటిని సరిగ్గా పరీక్షించలేక పోయారు. అందరూ ఓడిపోయారు, నేను విజేతగా అన్నీ చోట్లకు తిరుగుతున్నాను. ఇప్పుడు నేను మీ రాజ్యానికి వచ్చాను.". " ఏమిటవి ?", అని రాజు కుతూహలంగా అడిగాడు. అతను ఆ రెండు వస్తువులను రాజగారి బల్ల మీద పెట్టాడు. అవి రెండూ సరిగ్గా ఒకే పరిమాణంలో, ఒకే ఆకారంలో, ఒకే రూపురేఖలతో, ఒకేలా ప్రకాశిస్తూ, అన్నీ వైపులా నుండీ, అన్నీ రకాలుగా ఒకేలా ఉన్నాయి. రాజు వెంటనే, "ఈ రెండూ వస్తువులూ ఒకటే" అన్నాడు. దానికి ఆ వ్యక్తి ఇలా అన్నాడు, "అవును, అవి ఒకేలా కనిపిస్తున్నాయి, కానీ అవి భిన్నంగా ఉంటాయి. వాటిలో ఒకటి చాలా విలువైన వజ్రం, మరొకటి కేవలం ఒక గాజు ముక్క. కానీ వాటి స్వరూపం, వాటి రంగు ఒకే విధంగా ఉంటాయిబీ ఇప్పటి వరకు ఏది వజ్రమో, ఏది గాజు ముక్కో ఎవరూ గుర్తించలేకపోయారు... ఎవరైనా వాటిని పరీక్షించి ఇది వజ్రం అని, మరొకటి గాజు అని చెప్పవచ్చు. ఎవరైనా సరిగ్గా గుర్తించగలిగితే, నేను ఓటమిని అంగీకరించి, ఈ విలువైన వజ్రాన్ని మీ రాజ్య ఖజానాలో నిక్షిప్తం చేస్తాను. కానీ షరతు ఏమిటంటే, ఎవరైనా దానిని గుర్తించలేకపోతే, ఈ వజ్రం విలువతో సమానమైన మొత్తాన్ని మీరు నాకు ఇవ్వాలి. నేను చాలా రాజ్యాల నుండీ ఇప్పటికి ఇలా మొత్తాన్ని గెలుపొందాను". "నేను దానిని పరీక్షించలేను",అన్నాడు రాజు. దివాన్లు కూడా, "రెండూ సరిగ్గా ఒకేలా ఉన్నందున మేము కూడా ధైర్యం చేయలేం." ఓడిపోతామనే భయంతో ఎవరూ ధైర్యం చేయలేకపోయారు. ఓడిపోయిన తర్వాత చెల్లించవలసిన డబ్బు, అంత సమస్య కాదు, ఎందుకంటే రాజు దగ్గర చాలా ధనం ఉంది. అయితే రాజుగారి పరువు పోతుందేమోనని అందరూ భయపడి, ఎవరూ గుర్తించదానికి ముందుకురాలేకపోయారు. హఠాత్తుగా, ఆ ప్రదేశానికి ఒక మూలన చిన్న అలజడి మొదలయ్యింది. ఒక గుడ్డివాడు చేతిలో కర్ర పట్టుకుని ముందుకొచ్చాడు. "నన్ను రాజు దగ్గరకు తీసుకువెళ్ళండి. నేను ఇందాకటి నుండీ ఈ విషయాలన్నీ వింటున్నాను, అలాగే ఈ వజ్రాన్ని ఎవరూ పరీక్షించలేకపోతున్నారు. నాకు ఒక అవకాశం ఇవ్వండి", అన్నాడు. ఒక వ్యక్తి సహాయంతో రాజు వద్దకు చేరుకుని, రాజును ఇలా అభ్యర్థించాడు, "నేను పుట్టుకతో అంధుడిని, అయితే దయచేసి నాకు ఒక అవకాశం ఇవ్వండి, తద్వారా నేను కూడా నా తెలివితేటలను ఒకసారి పరీక్షించుకోవచ్చు. బహుశా నేను విజయం సాధించవచ్చునేమో .... ఒకవేళ నేను విజయం సాధించలేకపోయినా, మీరు ఎలాగూ పందెం ఓడిపోతున్నారు కాబట్టి అంతకుమించి వేరే కోల్పోయేదేమి ఉండదు." అతని మాటలు రాజుకి అర్థం అయ్యి ఒక అవకాశం ఇచ్చినందువల్ల నష్టం లేదని భావించాడు. రాజు తన ఆమోదం తెలుపుతూ, "సరే" అన్నాడు. ఆ తర్వాత ఆ వృద్ధుడికి ఆ రెండు వస్తువులను తాకించి, వీటిలో ఏది నిజమైన వజ్రం, ఏది గాజుముక్క అని అడిగారు. ఒక్క క్షణంలో, ఆ వ్యక్తి, 'ఇది విలువైన వజ్రం, ఆ రెండవది కేవలం గాజుముక్క!' అని చెప్పాడు. అన్నీ రాజ్యాలలో గెలిచి వచ్చిన వ్యక్తి నమస్కరించి, "అది నిజమే, నువ్వు బాగా గుర్తించావు.. నువ్వు చాలా గొప్పవాడివి...ఇచ్చిన మాట ప్రకారం ఈ వజ్రాన్ని నీ రాజ్య ఖజానాకి ఇచ్చేస్తున్నాను", అన్నాడు. అందరూ చాలా సంతోషించారు. వచ్చిన వ్యక్తి కూడా వజ్రాల నిజమైన నాణ్యతను గుర్తించేవారు కనీసం ఒకరైనా ఉన్నారని చాలా సంతోషించాడు. వచ్చిన వ్యక్తి , రాజు, ఇతర ప్రజలందరూ ఒకే ఉత్సుకతను వ్యక్తం చేస్తూ, ఆ అంధుడిని ఇలా అడిగారు, "నీవు కనీసం చూడలేవు కదా, ఇది వజ్రం, ఇంకోటి గాజు అని ఎలా గుర్తించావు?" అంధుడైన ఆ వృద్ధుడు ఇలా అన్నాడు, "అది చాలా తేలిక, ప్రభూ, మనమంతా ఇందాకటి నుండీ ఎండలో కూర్చుని ఉన్నాం. అలాగే ఈ రెండూ కూడా చాలాసేపటి నుండి ఎండలో ఉంచబడ్డాయి. రెండింటినీ ముట్టుకున్నాను. చల్లగా ఉన్నది నిజమైన వజ్రం. .. వేడెక్కింది గాజు... అంతే." జీవితంలో కూడా, ప్రతి చిన్న విషయానికి వేడెక్కిపోయినవారు, చిక్కుబడిపోతారు, బంధింపబడిపోతారు ... ఆ వ్యక్తి "గాజు" వంటివారు. ప్రతికూల పరిస్థితులలో కూడా చల్లగా (శాంతంగా, స్థిరంగా) ఉండేవాడు ... ఆ వ్యక్తి మాత్రమే "విలువైన వజ్రం". !! ఒకసారి మనస్సు సామరస్య స్థితిలోకి వస్తే, దానిపై బాహ్య పరిస్థితుల, బాహ్య వాతావరణ ప్రభావం ఉండదు, అంతర్గత కలవరం కూడా ఉండదు.

**బాబూజీ,**
**సేకరణ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి**
**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం**

## నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవస్య విద్యాలయలో విందు

స్నేహం ఫౌండేషన్ ఫౌండర్ బి.లక్ష్మీ ప్రసన్న





**కడప పెన్ పవర్ జూలై 20 :** కడప నగరం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవశ్య విద్యాలయంలో సి.బలరామరాజు ఏఆర్ కానిస్టేబుల్ తన తండ్రి వెంకటరాజు వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలసి స్నేహం ఫౌండేషన్ లక్ష్మీ ప్రసన్న ఫౌండర్, భాస్కర్ చైర్మన్ ఆధ్వర్యంలో 110 మంది విద్యార్థులకు భోజన విందు కార్యక్రమం స్నేహం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అనంతరం ఏపీఎస్ఆర్టీసీ అకౌంటెంట్ రామ లక్ష్మణ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సి బలరామరాజు కుటుంబ సభ్యులు, సివి భాస్కర రెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ అకౌంటెంట్ రామ లక్ష్మణ్, స్నేహం ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్, ఫౌండర్ లక్ష్మీప్రసన్న, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## క్రీడల్లో మంచి నైపుణ్యం పొందాలి

– డోలా రాజారెడ్డి



**ధర్మవరం పెన్ పవర్ జూలై 20 :** క్రీడల్లో మంచి నైపుణ్యం పొందాలని బిజెపి నాయకుడు డోలా రాజారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ప్రభుత్వ బాలుర మైదానంలో జరుగుతున్నటువంటి వీక్లీడ్ క్రికెట్ మ్యాచ్ కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అక్కడ జరుగుతున్నటువంటి అనంతపురం అండ్ ధర్మారం క్రికెట్ జట్టుకు టాస్ వేసి ఇరువురు కెప్టెన్లకు శుభాకాంక్షలు తెలిపి క్రీడలను ప్రారంభించారు. తదుపరి వారు మాట్లాడుతూ మీకు క్రీడకు సంబంధించిన క్రికెట్ మ్యాచ్ ఇవ్వడం జరుగుతుందని వారు హామీ ఇచ్చారు. క్రీడలకు సంబంధించిన ఏ అవసరమైనా సరే నా దిష్టికి తీసుకొని వస్తే మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వారు తెలిపారు.

## 'ఆర్.సి.కృష్ణస్వామి రాజు బాలసాహిత్యం' పై సదస్సు

**కడప పెన్ పవర్ జూలై 20 :** యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 145వ సదస్సును 27వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి పేర్కొన్నారు. ఈ 145వ సదస్సులో 'ఆర్.సి.కృష్ణస్వామి రాజు బాలసాహిత్యం' అనే అంశంపై విశ్రాంత తెలుగు అధ్యాపకులు డా? నెమిలేటి కిట్టన్న (తిరుపతి) ప్రసంగిస్తారన్నారు. సాహితీ ప్రియులు అభిమానులు హాజరు కావాలని ఆమె కోరారు.

## జూలై 29న గరుడ పంచమి

**తిరుమల పెన్ పవర్ జూలై 20 :** తిరుమలలో జూలై 29వ తేదీ మంగళవారంనాడు గరుడ పంచమి పర్వదినం జరుగనుంది. ఈ సందర్భంగా రాత్రి 7 నుండి 9 గంటల వరకు శ్రీ మలయప్పస్వామివారు తనకు ఇష్టవాహనమైన గరుడునిపై తిరుమాడ వీధులలో ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. ఈ నెలలో స్వామివారు రెండో సారి గరుడ వాహనంపై దర్శనమివ్వనున్నారు. ప్రతి ఏడాదీ తిరుమలలో గరుడ పంచమిని ఘనంగా నిర్వహిస్తారు. నూతన దంపతులు తమ వైవాహిక జీవితం ఆనందదాయకంగా ఉండేందుకు, స్త్రీలు తమకు పుట్టే సంతానం గరుడునిలాగా బలశాలిగా, మంచి వ్యక్తిత్వం గలవాడిగా ఉండేందుకు "గరుడపంచమి" పూజ చేస్తారని ప్రాశస్త్యం.

## ఎన్నికల కమిషన్ బిజెపికి అనుకూలంగా... సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



**కడప పెన్ పవర్ జూలై 20 :** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం బీహార్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) కు ఆదేశించింది. ఇప్పుడు, ఈ ప్రక్రియను దేశం మొత్తానికి విస్తరించాలని ఇ.సి. కోరుకుంటోంది. ఓటర్ల జాబితాలను సవరించడం పేరిట, ఓటర్ల పౌరసత్వాన్ని ధృవీకరించే అధికారాన్ని వినియోగించుకుం టోంది, ఓటర్ల జాబితా నుండి విదేశీయులను తొలగించాలనే నిరాధారమైన సాకుతో, వారు మైనారిటీలలోని విస్తారమైన వర్గాలను, ఇతర ఎంపిక చేసిన సమూహాలను ఓటుహక్కును కోల్పోతున్నారు. రాజ్యాంగం హామీ ఇచ్చిన ఓటు హక్కును కూడా చాలా మందికి నిరాకరించవచ్చు. కోవిడ్ మహమ్మారికి ముందు ప్రజలు విస్తృతంగా వ్యతిరేకించిన ఎన్.ఆర్.సి. కసరత్తును వెనుక తలుపు ద్వారా రహస్యంగా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇప్పటి వరకు బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన ఇ.సి, ఇప్పుడు సంఘ్ పరివార్ ఎజెండాను అమలు చేయడంలో భాగస్వామిగా మారింది. ప్రజాస్వామ్య హక్కులపై ఈ దాడిని అనుమతించకూడదు. ఎన్నికల సంఘం యొక్క ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యకు వ్యతిరేకంగా 2025 ఆగస్టు 8న దేశవ్యాప్తంగా నిరసనలు నిర్వహించాలని సిపిఐ(ఎం) పిలుపునిచ్చింది. బిజెపి ప్రభుత్వం ఆమోదించిన మహారాష్ట్ర ప్రజా భద్రతా బిల్లు ప్రజల ప్రజాస్వామ్య హక్కులపై పెద్ద దాడి. అతివాద వామపక్ష శక్తులతో పోరాడటం పేరిట, అసమ్మతిని వ్యక్తం చేసే వారందరినీ ప్రజా భద్రతకు, జాతీయ భద్రతకు ముప్పుగా చిత్రీకరించడానికి ఈ బిల్లు ప్రయత్నిస్తుంది. ఇది ఏ ప్రతిపక్షాన్ని లక్ష్యంగా చేసుకోవడానికి తగినంత అవకాశాలను సృష్టిస్తుంది. అసమ్మతిని అణచివేయడానికి, రాజకీయ వ్యతిరేకతను నిశ్శబ్దం చేయడానికి బిల్లులోని కఠినమైన నిబంధనలను ఉపయోగించే ప్రమాదం ఉంది. ఈ నిరంకుశ బిల్లును నిరసించాలని, దానిని వెంటనే రద్దు చేయాలని సిపిఐ(ఎం) అన్ని రాజకీయ పార్టీలకు, ప్రజాస్వామ్య శక్తులకు విజ్ఞప్తి చేసింది. పహల్గామ్లో ఉగ్రవాద దాడి భద్రతా వైఫల్యం ఫలితంగా జరిగిందని జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ ఇటీవల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అంగీకరించారు. కేంద్రపాలిత ప్రాంతంగా, జమ్మూ కాశ్మీర్ను కేంద్రం నేరుగా నిర్వహిస్తుంది మరియు ఎన్నికైన ముఖ్యమంత్రి కూడా శాంతిభద్రతలకు సంబంధించిన చర్చలు మరియు నిర్ణయాలలో పాల్గొనకుండా నిషేధించబడ్డారు. భద్రతా లోపాన్ని అంగీకరించడం, వాస్తవానికి, భద్రతకు నేరుగా బాధ్యత వహించే కేంద్ర హోంమంత్రి వైఫల్యాన్ని అంగీకరించడం. ఇటువంటి తీవ్రమైన లోపానికి ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలి,

లెఫ్టినెంట్ గవర్నర్ ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వ పనితీరును బలహీనపరుస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, భూస్వామ్య మహారాజుకు వ్యతిరేకంగా పోరాడిన 22 మంది అమరవీరుల మరణానికి గుర్తుగా, ఆయన పాలన నుండి జమ్మూ కాశ్మీర్ విముక్తి కోసం ఆయన సెలవుదినాన్ని రద్దు చేశారు. బదులుగా, రైతులను చంపి, విముక్తి పోరాటాన్ని అణచివేయడానికి ప్రయత్నించిన మహారాజు పుట్టినరోజును సెలవు దినంగా ప్రకటించారు. ముఖ్యమంత్రి సహా వివిధ రాజకీయ పార్టీల నాయకులను అమరవీరులకు నివాళులర్పించడానికి అనుమతించలేదు. ఇది ప్రజాస్వామ్య హక్కులు, సమాఖ్య నిర్మాణంపై తీవ్రమైన దాడి. జమ్మూ కాశ్మీర్కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించడానికి, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజల తీర్పును గౌరవించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఐ (ఎం) డిమాండ్ చేస్తోంది. బెంగాలీ మాట్లాడే ప్రజలపై లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయని అనేక రాష్ట్రాల నుండి నివేదికలు వెలువడుతున్నాయి. ఢిల్లీ, ఒడిశా, అస్సాం, హర్యానా, ఛత్తీస్గఢ్, మహారాష్ట్ర వంటి అనేక బిజెపి పాలిత రాష్ట్రాల్లో, బెంగాలీలను వారి పత్రాల సరైన ధృవీకరణ లేకుండా, తగిన ప్రక్రియను అనుసరించకుండా గుర్తిస్తున్నారు. అటువంటి వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని అమానవీయ వేధింపులు, చిత్రహింసలకు గురిచేస్తున్నారు. భారతీయ పౌరులతో సహా భూమి ద్వారా మరియు సముద్ర మార్గం ద్వారా కూడా బలవంతంగా బంగ్లాదేశ్కు తిరిగి పంపిన సందర్భాలు కూడా ఉన్నాయి. బెంగాలీలపై ఈ లక్ష్యంగా దాడులను సిపిఐ(ఎం) వ్యతిరేకిస్తుంది, ఎందుకంటే వారు భారత రాజ్యాంగం ద్వారా పౌరులందరికీ మంజూరు చేసిన ఉద్యమ స్వేచ్ఛకు వ్యతిరేకం. ఈ అక్రమ నిర్బంధాలను నిలిపివేయాలని, ప్రజల హక్కులను పరిరక్షించాలని పార్టీ ప్రభుత్వాన్ని కోరుతోంది. అస్సాం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద సంఖ్యలో ప్రజలను వారి సరైన భూముల నుండి తొలగిస్తోంది. ముఖ్యమంత్రి ఈ తొలగింపుల గురించి ప్రగల్భాలు పలుకుతూ, సమాజంలో మతపరమైన ధ్రువీకరణను మరింత పెంచడానికి వాటిని ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ భూముల క్రింద గొప్ప ఖనిజ వనరులు ఉన్నాయని ఇటీవలి నివేదికలు, వాటిని దోపిడీ చేయడానికి ప్రైవేట్ సంస్థలను అనుమతించాలనే ఆత్రుతతో పాటు, ఈ తొలగింపుల వెనుక మరొక కారణాన్ని అందిస్తున్నాయి. బిజెపి వివిధ ఈశాన్య రాష్ట్రాలలో జాతి విభేదాలను పెంచి, విభజనలను సృష్టించి తమ ఆధిపత్యాన్ని స్థాపించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ చర్యలు మన దేశం యొక్క ఐక్యత మరియు సమగ్రతను దెబ్బతీస్తాయి, ముఖ్యంగా సుదీర్ఘ అంతర్జాతీయ సరిహద్దును పంచుకునే ప్రాంతంలో హిందుత్వ భావజాలాన్ని ప్రోత్సహించడానికి కేరళ గవర్నర్ తన రాజ్యాంగ పదవిని దుర్వినియోగం చేస్తున్నారు. రాజ్భవన్ నిర్వహించే బహిరంగ కార్యక్రమాలలో, రాజ్యాంగం గుర్తించని చిహ్నాలైన అఖండ భారత్ పటాన్ని, భారత మాత చిత్రాలను ఉద్దేశపూర్వకంగా ప్రదర్శిస్తున్నారు. ఎన్నికైన ఎల్.డి.ఎఫ్. ప్రభుత్వ సలహాను ఆయన బహిరంగంగా ధిక్కరించి, రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా అధికారిక కార్యక్రమాలను నిర్వహించడానికి నిరాకరించారు. తన చర్యల ద్వారా ప్రభుత్వం సమర్థించిన లౌకిక విలువలను అణగదొక్కడానికి మరియు దాని అనుబంధ సంస్థలను ఆయన చురుకుగా ప్రోత్సహిస్తున్నారు. గవర్నర్ చర్యలకు వ్యతిరేకంగా సమాజంలోని వివిధ వర్గాలు, ముఖ్యంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ ప్రదర్శనలను సిపిఐ (ఎం) ప్రశంసించింది. గవర్నర్ల అధికారాలపై తీర్పు వెలువడిన తరువాత కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లను ఉపసంహరించుకోవడానికి అనుమతి ఇవ్వడానికి బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు తమిళనాడుకు మాత్రమే పరిమితం కాకుండా, అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుంది కాబట్టి ఈ పిటిషన్లు ఇప్పుడు నిష్ఫలంగా ఉన్నాయి. గవర్నర్ మరియు కేంద్ర ప్రభుత్వం యొక్క ఉద్దేశ్యం వ్యాజ్యాన్ని పొడిగించడం మరియు విశ్వవిద్యాలయాలకు రెగ్యులర్ వైస్ ఛాన్సలర్లను నిరాకరించేలా చూడటం, వారిని నిర్ణీత ప్రక్రియ ద్వారా నియమించాలి. రెగ్యులర్ వీసీలను నియమించడంలో గవర్నర్ విఫలమయ్యారని కేరళ హైకోర్టు కూడా విమర్శించింది. కేరళ ఉన్నత విద్యా వ్యవస్థను అపకీర్తి పరచడానికి, నాశనం చేయడానికి ఒక చేతన ప్రయత్నం జరుగుతోంది.

## బంగారు పిచ్చుకలను కాపాడుకుందాం


గ్రీన్ క్లైమేట్ చైర్మన్ జెవి రత్నం











**విజయవాడ పెన్ పవర్ జూలై 20 :** ప్రకృతి ఆధారిత పంటలకు ఉపకరించేది బంగారు పిచ్చుక పరపరాగ సంపర్కంలో బంగారు పిచ్చుక స్థానం చాలా గొప్పది. ప్రతి ఒక్కరు స్పందించండి బంగారు పిచ్చుకలను కాపాడండి– జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం బంగారు పిచ్చుకలను కాపాడుకుందాం అని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం కోరారు. మంగళవారం మధ్యాహ్నం సబ్బవరం లో తాటి చెట్టు మీద వందలాదిగా గూళ్ళు పెట్టుకున్న బంగారు పిచ్చుకలను సిఫా ట్రస్ట్, గ్రీన్ క్లైమేట్ టీం లు పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పంటలకు ఉపకరించేది బంగారు పిచ్చుక అన్నారు. పరపరాగ సంపర్కంలో బంగారు పిచ్చుక స్థానం చాలా గొప్పది అన్నారు. ప్రతి ఒక్కరు స్పందించండి బంగారు పిచ్చుకలను కాపాడండి అని కోరారు. గడ్డి , కలుపు నివారణ కోసం వినియోగించే రసాయనాలు, క్రిమి సంహారక రసాయన మందులు, హైపవర్ టవర్ లైన్స్ నుండి విడుదల అవుతున్న ఎలక్ట్రో మేగ్నటిక్ వేవ్స్ వల్ల ఇవి అంతరించి పోతున్నాయి అని ఆందోళన వ్యక్తం చేశారు. సిఫా ట్రస్ట్ సిఇఒ డాక్టర్ శశిప్రభ మాట్లాడుతూ అంతరిస్తున్న రైతు నేస్తం బంగారు పిచ్చుక అన్నారు. దీనిని కాపాడుకోవాల్సిన అవసరం అన్నం తినే ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. పంటలను ఆశించే క్రిమి, కీటకాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా పంటలకు మేలు చేస్తుంది అన్నారు. అలాంటి బంగారు పిచ్చుకలు నివసించే ప్రాంతాలను ఎకో సెన్సిటివ్ ప్లేస్ లుగా పేర్కొంటూ ప్రభుత్వం వాటిని పరిరక్షించాలి అన్నారు. అంతరించిపోతున్న జాతికి చెందిన ఈ బంగారు పిచ్చుకను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని ఆమె వివరించారు.

## ఓర్పుతో ఓపికతో మనం సహాయం చేయగలమా..,

– డాక్టర్ సునీత...



కన్న పెన్ పవర్ జూలై 20 : ఒక తెలియని వ్యక్తికి చాలా ఓర్పుతో, ఓపికతో మనం సహాయం చేయగలమా? అలాంటి ఒక రాత్రి..... డ్యూటీలో ఉన్న నర్సు ఆందోళన చెందుతున్న యువ ఆర్మీ మేజర్ ను మంచం వద్దకు తీసుకువెళ్లింది. "మీ అబ్బాయి వచ్చాడు" అంటూ మంచమ్మీద పడుకున్న ఒక పెద్దాయనతో మెల్లగా చెప్పింది. ఆ వృద్ధుడు కళ్ళు తెరిచే వరకు ఆమె ఈ మాటలను పదే పదే చెప్పవలసి వచ్చింది. గుండెపోటు వల్ల కలిగిన నొప్పి కారణంగా అపస్మారక స్థితిలో ఉన్న , అతను కళ్ళు తెరవలేకపోతున్నాడు. ఆక్సిజన్ టెంట్ వెలుపల యూనిఫాంలో నిలబడి ఉన్న యువ మేజర్ ని ఎలాగోలా చూడగలిగాడు. యువ మేజర్ తన చేయి అందించాడు. ఆ పెద్దాయనకు తన ప్రేమను, ఆప్యాయతను తెలియజేయడానికి, మేజర్ దగ్గరికి వెళ్లి జాగ్రత్తగా, నెమ్మదిగా కౌగిలించుకునే ప్రయత్నం చేశాడు. ఆ తరువాత, మేజర్ తన లేత వేళ్లలో ఆ ముసలి చేతులను గట్టిగా పట్టుకుని, 'నేను ఇక్కడే ఉన్నాను, మీతోనే ఉన్నాను' అనే విశ్వాసపూరిత అనుభూతిని కలిగించాడు. హృదయానికి హత్తుకునే ఆ క్షణాలను చూసిన నర్సు వెంటనే మేజర్ మంచం దగ్గర కూర్చునేలా ఒక కుర్చీ తెచ్చింది. "ధన్యవాదాలు సిస్టర్," అని చెబుతూ మేజర్ మర్యాదపూర్వకమైన అంగీకారాన్ని తెలియచేశాడు. రాత్రంతా, యువ మేజర్ వెలుతురు లేని ఆ వార్డులో కూర్చున్నాడు, పెద్దాయన చేతిని పట్టుకుని, ఆప్యాయత, ప్రేమ, ధైర్యం సంబంధించిన మాటలు చెప్తూ, అతనికి బలాన్ని ఇచ్చాడు. మధ్యలో చాలాసార్లు, నర్సు వచ్చి మేజర్ తో, "నువ్వు కూడా కాసేపు విశ్రాంతి తీసుకో" అని చెప్పింది, దానిని మేజర్ సున్నితంగా తిరస్కరించాడు. నర్సు ఆ వార్డుకు వచ్చిన ప్రతిసారీ, అతను ఆమె రాక గురించి కాని, ఆసుపత్రిలో సందడి గురించి గానీ పట్టించుకోలేదు. వృద్ధుడి చేతులు పట్టుకుని మాత్రం కూర్చున్నాడు. ఆక్సిజన్ ట్యాంక్ రొద, రాత్రి సిబ్బంది నవ్వులు, ఇతర రోగుల కేకలు, మూలుగులు, ఏవీ అతని ఏకాగ్రతను భంగం చేసినట్లు అనిపించలేదు. మేజర్ పెద్దాయనతో కొన్ని మృదువైన మాటలను గొణుగుతుండడం ఆమె వింటూ ఉంది. వృద్ధుడు ఏమీ మాట్లాడలేదు కానీ రాత్రంతా తన కొడుకు చేతిని మాత్రం గట్టిగా పట్టుకుని ఉన్నాడు. తెల్లవారుజామున ఆ వృద్ధుడు చనిపోయాడు. మేజర్ ఆ నిర్జీవమైన చేతిని వదిలి, నర్సుకు ఈ విషయం తెలియజేయడానికి వెళ్ళాడు. రాత్రంతా మేజర్ తాను చేయవలసిన కర్తవ్యం చేసాడు, అతను వేచి ఉన్నాడు. నర్సు వచ్చి, సానుభూతి చూపడానికి ఏదో అందామనుకునేలోపు, మేజర్ ఆమెను, "ఆ వ్యక్తి ఎవరు?" అని అడిగాడు. నర్సు ఆశ్చర్యపోయింది. "అతను మీ తండ్రి కదా," అని అంది. "లేదు, ఈయన నా తండ్రి కాదు," అని మేజర్ సమాధానమిస్తూ, "నేను అతనిని నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు", అన్నాడు. "అయితే నిన్ను అతని దగ్గరకు తీసుకెళ్ళినప్పుడు నువ్వు ఎందుకు ఏమీ మాట్లాడలేదు?" అని అడిగింది. "ఏదో పొరపాటు జరిగిందన్న విషయం నాకు వెంటనే అర్థం అయింది, కానీ ఆయనకి తన కొడుకు అవసరమని, అతను ఇక్కడ లేడని కూడా తెలుసుకున్నాను." నర్సు వింటూనే ఉంది, కానీ అయోమయంలో ఉంది! "వృద్ధుడు చాలా అనారోగ్యంతో, అవశానదశలో ఉన్నాడని గ్రహించాను, అతనికి నా అవసరం ఉందనిపించి, నేను అతని కొడుకుగా ఇక్కడ ఉండిపోయాను." అన్నాడు. "అయితే నువ్వు ఈ ఆసుపత్రికి ఎందుకు వచ్చావు?", అని నర్సు అతనిని అడిగింది. "నేను నిజానికి మిస్టర్ విక్రమ్ సలారియాను చూడడానికి రాత్రి ఇక్కడకు వచ్చాను. అతని కొడుకు కొద్ది రోజుల క్రితం జమ్మూ., కాశ్మీర్ లో చంపబడ్డాడు", అన్నాడు. "కానీ మీరు రాత్రంతా చేయి పట్టుకున్న కూర్చున్న ఆ వ్యక్తే, మిస్టర్ విక్రమ్ సలారియా", అని నర్స్ చెప్పింది. ఇద్దరూ మాట్లాడానికి ఇంక ఏమీ లేనట్లుగా నిశ్శబ్దంగా నిలబడ్డారు. చనిపోతున్న వ్యక్తికి తన కొడుకు చేయి కంటే వేరే భరోసా ఏమీ ఉండదని గ్రహించడంతో ఇద్దరూ కొంతసేపు మౌనంగా ఉండిపోయారు. మిత్రులారా, జీవితంలో ఎవరికైనా ఇలాంటి అవసరం వస్తే, మనం అక్కడ ఉండాలి, చివరి వరకు వారితోనే ఉండాలి. మన మాటలు, ఉత్సాహం, భరోసా, ఎదుటి వ్యక్తికి మనం అండగా ఉంటామనే భావన వల్ల వారు స్వస్థపడే అవకాశం ఉంటుంది. మీ వద్ద పుష్కలంగా ఉన్నదానిని, లేని వారితో పంచుకోండి. ఔదార్యం, ఉదారత అనేది మన సహజ స్థితి. సహానుభూతి అంటే – ఇతరులు ఏమి అనుభూతి చెందుతున్నారో, మనలో వారు ఎలాంటి భావాలను రేకెత్తిస్తున్నారో – ఇలాంటి ఇతరుల భావాలను సహజంగా అర్థం చేసుకోవడం.

కానీ మనం స్థిరంగా ఉండి, ఓపికగా, ఓర్పుగా అంతర్గతంగా ప్రశాంతంగా లేకపోతే, మన యధార్థ లక్ష్యం నెరవేర్చుకోవడానికి దూరమవుతాం, కనీసం ఇతరులకు సహాయం చేయడంలో కూడా విఫలమవుతాం.

అన్నింటికంటే కూడా చాలా ముఖ్యమైన అంశం – మన ప్రవర్తన.

**దాజి**
**సేకరణ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి**
**సి.వి.భాస్కర్ రెడ్డి**
**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం**
**అనువాదబృందం ఆంధ్రప్రదేశ్**

## 5వ రోజు మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మె

**గిద్దలూరు పెన్ పవర్ జూలై 20 :** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె ఐదవ రోజు ఆదివారం కూడా కొనసాగింది. సమ్మెలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు పారిశుధ్య కార్మికుల తమ డిమాండ్లను పరిష్కరించాలని నిరసన తెలియజేసారు. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ చిరు ఉద్యోగులైన తమ కుటుంబాలకి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయవలసిన అవసరం ఉందని, మిగిలిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వలే రిటైర్మెంట్ వయస్సుని 62 సంవత్సరాలు కి పెంచాలని, జిఓ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, వీటితోపాటు అన్ని రకాల నిత్యావసరాల ధరలు పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేసారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు జి మురళి, రంగయ్య, సంటయ్య, పాపయ్య, బాలయ్య పాల్గొన్నారు.

